కఠిన శిక్షలు పడే విధంగా చట్టం చేయాలి



వైద్యులపై దాడి చేసిన వారికి కఠిన శిక్ష పడే విధంగా ప్రభుత్వాలు చట్టం చేయాలి. ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్న వైద్యులకు పూర్తి స్థాయి రక్షణ కల్పించాలి. ప్రతి ఆస్పత్రి వద్ద ఒకరు, ఇద్దరు పోలీసులను బందోబస్తు పెడితే దాడులు ఆగుతాయి. పోలీసులుంటే వైద్యులపై దాడి చేయడానికి ఎవరైనా భయపడతారు.

– డాక్టర్ కిరణ్ లలితాదేవి, మెడికల్ ఆఫీసర్, బాలాజీనగర్ యూపీహెచ్‌సీ

భద్రతా చర్యలు చేపట్టాలి



భవిష్యత్‌లో వైద్యులపై ఎలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం ముందు జాగ్రత చర్యలు చేపట్టాలి. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన దాడి మనకు మేలుకొలుపులాంటిది. ఆస్పత్రుల్లో సరైన రక్షణ, మౌలిక సదుపాయాలు కల్పించి, మహిళా వైద్యులకు వేరుగా విశ్రాంతి గదులు, వాష్‌రూంలు ఏర్పాటు చేయాలి. ప్రమాదం జరిగినప్పుడు సెక్యూటీని అప్రమత్తం చేసేలా అలారం విధానం ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ మహిత, మెడికల్ ఆఫీసర్, శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీ

పచ్చని వనం.. అయ్యో శిథిలం

- నిర్లక్ష్యం నీడలో కంబాల కొండ ఎకో టూరిజం పార్కు
- కనుమరుగవుతున్న పచ్చదనం..
- మూగబోయిన పక్షుల కిలకిలారావాలు
- కూలిపోయిన వాచ్ టవర్
- ఈ దుస్థితికి కన్నీళ్ల పర్యంతమవుతున్న ప్రకృతి ప్రేమికులు

ఆ వనం ఇంపైన సంగీతం వినిపించేది. కనులకు విందు చేసేది. ఎటు చూసినా ఎత్తయిన గిరుల సోయగాలు అందమైన లైవ్ పోర్ట్రైట్ కనుల ముందు సాక్షాత్కరించిన అనుభూతికి గురి చేసేవి. పచ్చని పచ్చికలు.. గలగల పారే సెలయేరుతో కలల లోకాన విహరిస్తున్న ఫీల్ కలిగేది. అటువంటి సోయగాల కంబాల కొండ ఎకో టూరిజం పార్కు నేడు శిథిలమై ప్రకృతి ప్రేమికులను ఆవేదనకు గురి చేస్తోంది. ఈ పార్కులోని పిల్లల ఆట పరికరాలు శిథిలమైపోయాయి. రచ్చబండ, సిమెంట్ బెంచీలు, కాలిబాటలు అన్నీ ధ్వంసమయ్యాయి. ఇక్కడికి సరదాగా గడుపుదాం అని వచ్చే వారు ఈ దుస్థితికి హతాశులవుతున్నారు. నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ పార్కుకు పూర్వవైభవం కల్పించాలని కోరుతున్నారు.



శిథిలమైన రచ్చబండ



పెచ్చులూడుతున్న సిమెంట్ బెంచీ



కంబాలకొండ పార్కు ముఖద్వారం

ఆరిలోవ : ప్రముఖ పర్యాటక కేంద్రం కంబాలకొండ ఎకో టూరిజం పార్కు శిథిలావస్థకు చేరుతోంది. అటవీ శాఖ పర్యవేక్షణలో ఉన్న ఈ పార్కు అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి దూరమవుతోంది. దీంతో ఒకప్పుడు సందర్శకులతో కళకళలాడిన ఈ పార్కు ఇప్పుడు బోసిపోతోంది. ఇక్కడ చూడడానికి ఏమీ లేకపోవడంతో సందర్శకులు రావడం లేదు. తెలియనివారు ఎవరైనా వచ్చి పిల్లలతో సరదాగా గడుపుదామనుకుంటే నిరాశే ఎదురవుతోంది. ఇక్కడ ఏమీ కనిపించకపోవడంతో ఉసూరుమని వెనుదిరుగుతున్నారు. ఒకప్పుడు ఇక్కడ పచ్చని చెట్లు, ఔషధ మొక్కల మధ్య వాచ్ టవర్, రివర్ క్రాసింగ్, పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలు ఉండేవి. వీటితో పాటు వివిధ రకాల పక్షులు తమ కిలకిలారావాలతో ఇంపైన సంగీతం వినిపించేవి. ఇప్పుడు అవేవీ లేక అంతా స్తబ్దుగా ఉంది.

పదేళ్లుగా జరగని అభివృద్ధి..

ఇక్కడ సుమారు పదేళ్ల నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. 2014 అక్టోబర్‌లో సంభవించిన హుద్‌హుద్ తుపాన్ ధాటికి ఈ పార్కు కకావికలమైంది. పచ్చని వన సంపద కూలిపోవడంతో దీని స్వరూపమే మారిపోయింది. అప్పటికే ఇక్కడ కొన్ని శిథిలావస్థకు చేరాయి. హుద్‌హుద్ తుపానుతో మరింత శిథిలమైంది. గతంలో ఇక్కడ ఉన్న వాచ్‌టవర్ కూలిపోయింది. రివర్ క్రాసింగ్ మూలకు చేరింది. పిల్లల ఆట పరికరాలు నేలమట్టమయ్యాయి. పక్షుల గూళ్లు కూలిపోయాయి. దీంతో దీన్ని సందర్శించిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు తుపాన్ నష్టం అంచనా వేసి దీనికి రూ.12 కోట్ల నిధులు కేటాయించారు. ఆ నిధులు ఖర్చు చేయడంలో అటవీశాఖ అధికారులు విఫలమయ్యారు. నిజానికి ఆ నిధులతో అద్భుతమైన పార్కుగా దీన్ని తీర్చిదిద్దాలని అప్పట్లో మాస్టర్ ప్లాన్ రూపొందించారు. పిల్లల కోసం విశాలమైన క్రీడా మైదానాలు, సందర్శకులు సేదదీరడానికి రచ్చబండలు, బెంచీలు, వాకింగ్ ట్రాక్‌లు, ట్రెక్కింగ్ ట్రాక్‌లు, పచ్చని లాన్‌లతో పార్కులు, వివిధ రకాల పక్షులు, వినోద పరికరాలు, సమావేశం కోసం విశాలమైన హాల్ వంటివి నిర్మిస్తామన్నారు. వాచ్ టవర్ ఆధునికీకరణ, రివర్ క్రాసింగ్ పునరుద్ధరణ చేపడతామన్నారు. అయితే ఇవేవీ ఇక్కడ కార్యరూపం దాల్చలేదు. మంజూరైన ప్రపంచ బ్యాంక్ నిధులను అటవీశాఖ అధికారులు ఖర్చు చేయకుండా వదిలేశారు. దీంతో ఈ పార్కు నిరాదరణకు గురి కావడంతో గతంలో ఉండే సౌకర్యాలు కూడా మాయమయ్యాయి. ప్రస్తుతం సందర్శకుల తాకిడి పూర్తిగా తగ్గిపోయింది. కార్తీకమాసంలో పిక్నిక్ సందడి తప్ప మిగిలిన సమయాల్లో దీని వైపు ఎవరూ చూడటంలేదు. దీంతో ఈ పార్కు మూలకు చేరుతోంది. దీనిపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారంటూ సందర్శకులు పెదవి విరుస్తున్నారు.

ఒక్కొక్కటిగా.. అన్నీ శిథిలం..

కంబాలకొండ, దాని చుట్టూ ఉన్న కొండల వ్యూ కనిపించే విధంగా ఏర్పాటు చేసిన వాచ్ టవర్ 12 ఏళ్ల క్రితమే శిథిలమైంది. అప్పటి నుంచి దీని పునర్నిర్మాణం జరగలేదు. ఇక్కడి కొలనును దాటడానికి ఏర్పాటు చేసిన రివర్ క్రాసింగ్‌దీ అదే పరిస్థితి. ఇక్కడ పర్యావరణానికి హాని కలగకుండా గతంలో నిర్మించిన మట్టి రోడ్లు కూడా రాళ్లు తేలి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. సందర్శకుల కోసం చెట్ల చుట్టూ నిర్మించిన రచ్చబండల గచ్చులు ఊడిపోయాయి. కూర్చోవడానికి ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు, రాతి బెంచీలు విరిగిపోతున్నాయి. పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు తుప్పు పట్టిపోయాయి. ఒకప్పుడు ఇక్కడ సందర్శకుల కోసం ఐదు కాటేజీలు నిర్మించారు. చల్లదనం కోసం గడ్డితో వాటికి పైకప్పులు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ కాటేజీలు శిథిలమయ్యాయి. దీంతో ఒకప్పుడు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచిన ఈ ఎకో టూరిజం పార్కు ఇప్పుడు శిథిలావస్థకు చేరి పర్యావరణవేత్తలను ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటికైనా ఈ పార్కును అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని ప్రకృతి ప్రేమికులు, ప్రజలు కోరుతున్నారు.



విరిగిన రాతి బెంచీ



కంబాలకొండలో తుప్పుపట్టిన ఆట పరికరాలు

నిర్లక్ష్యం తగదు..



కంబాలకొండ ప్రకృతి అందాలకు నిలయం. వివిధ రకాలైన ఔషధాలు ఉండే ప్రాంతం. దీనిలో గతంలో పిల్లలు ఆడుకోవడానికి ఎన్నో ఆట పరికరాలు ఉండేవి. పెద్దలు సేదదీరడానికి రాతి బెంచీలు, సిమెంట్‌తో తయారు చేసిన బెంచీలు ఉండేవి. అవి ఇప్పుడు విరిగిపోయాయి. పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు శిథిలమయ్యాయి. సుమారు పది సంవత్సరాలకు పైగా ఇక్కడ ఎలాంటి అభివృద్ధి చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా ఈ పార్కును అభివృద్ధి చేయాలని కోరుతున్నాం.

– సత్తి మందారెడ్డి, ఆరిలోవ

పూర్వవైభవం కల్పించాలి..



కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో గతంలో కుటుంబ సభ్యులతో కలిసి విశ్రాంతి తీసుకోవడానికి ఎంతో వెసులుబాటుగా ఉండేది. ఇప్పుడు అందులోని కాటేజీలు శిథిలమయ్యాయి. పార్కు చుట్టూ గొలుసుకట్టుగా ఉండే కొండలు, ప్రకృతి అందాలను చూడడానికి ఏర్పాటు చేసిన వాచ్‌టవర్ కూలిపోయింది. వాటిని ఇప్పటికీ పునరుద్ధరించలేదు. కార్తీకమాసంలో ఇక్కడ వనభోజనాలు ఎక్కువగా జరుగుతాయి. అలాగే పిక్నిక్‌లు జరుపుకునేవారికి పచ్చని చెట్లు తప్ప ఇంకెలాంటి సౌకర్యాలు లేవు. అధికారులు ఈ పార్కుకు పూర్వవైభవం కల్పించాలి.

– ఎం.వి.రావు, ఆరిలోవ

క్లుప్తంగా

ముడసర్లోవ పార్కులో సినిమా సెట్



ముడసర్లోవ పార్కులో వేస్తున్న సినిమా సెట్

ఆరిలోవ : ముడసర్లోవ పార్కులో తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ సినిమా షూటింగ్ జరగనుందని ప్రచారం జరుగుతోంది. దీని కోసం పార్కులోని పిల్లల ఆట స్థలాల్లో సమాధులకు సంబంధించిన పెట్టెలు, శిలువల సెట్ సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ తీసే దృశ్యాలు ఎక్కువ నిడివి ఉంటాయని సిబ్బంది తెలిపారు. వచ్చే నెల 2 నుంచి ఇక్కడ షూటింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఆసక్తితో చూడడానికి వస్తున్నారు.

బైబై కృష్ణ



తీరంలో కృష్ణుని విగ్రహంతో రాజస్థానీయులు

బీచ్‌రోడ్డు : గణేష్ విగ్రహ నిమజ్జనం తెలుసు.. దుర్గాదేవి విగ్రహ నిమజ్జనం తెలుసు. కానీ కృష్ణుడి విగ్రహాల నిమజ్జనం వింటే ఆశ్చర్యం కలగక మానదు. రాజస్థాన్‌లో కృష్ణాష్టమి వేడుకల అనంతరం కృష్ణుడి విగ్రహాలను నిమజ్జనం చేయటం సంప్రదాయం. దీనిని నగరంలో నివసిస్తున్న రాజస్థానీయులు పాటిస్తున్నారు. కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్న రాజస్థానీయులు మంగళవారం సాగరతీరంలో కృష్ణుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

వీనులవిందుగా గాత్ర కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న అరుణ్ బృందం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వార్షికోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు మంగళవారం చెన్నైకి చెందిన గాత్ర విద్వాంసులు ఒ.ఎస్.అరుణ్ గాత్ర కచేరీ వీనులవిందుగా సాగింది. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి శ్వాసం విద్యానంద, కళాభారతి అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అరుణ్ 11 కీర్తనలతో కచేరీకి విచ్చేసిన ఆహూతులను అలరించారు.

ఘనంగా కనకమ్మ అమ్మవారి మారువారం



ఆకట్టుకున్న వీధి వేషాలు

మద్దిలపాలెం : పాతవెంకోజీపాలెం గొల్లవీధిలో కొలువైన కనకమ్మ అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారి నుంచి భక్తులు అమ్మవారిని సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు సమర్పించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీధివేషాలు ఆకట్టుకున్నాయి.

తోటగరువు కృష్ణాలయంలో పూజలు

ఆరిలోవ : తోటగరువు శ్రీకృష్ణుడి ఆలయంలో సోమవారం నుంచి శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆయనతో పాటు మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెరుగుతున్న సైలెంట్ డీహైడ్రేషన్ కేసులు



మాట్లాడుతున్న వైద్యులు లోకనాథ్, రామానాయుడు

బీచ్‌రోడ్డు : గత దశాబ్ద కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఆంధ్రప్రదేశ్‌లో 1,788 మందికి పైగా ప్రాణాలను బలిగొన్నాయని, ఎక్కువగా ప్రభావితమైన ప్రాంతాల్లో వైజాగ్ ఒకటని ఎస్‌కే క్లినిక్స్ ఇంటర్నల్ మెడిసిన్ ఫిజీషియన్ డాక్టర్ లోకనాథ్ త్రిపాఠి, హ్యాపీ క్లినిక్ ఇంటర్నల్ మెడిసిన్ ఫిజీషియన్ డాక్టర్ ఎంవీఈ రామానాయుడు తెలిపారు. మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. వైజాగ్‌లో ఈ ఏడాది ఏప్రిల్‌లో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయిందన్నారు. విపరీతమైన తేమ కారణంగా ఇది 50 డిగ్రీల సెంటిగ్రేట్‌కి చేరుకునే అవకాశం ఉందన్నారు. ఈ కఠినమైన వాతావరణం సైలెంట్ డీహైడ్రేషన్‌కు దారి తీస్తోందన్నారు. ఇది తీవ్రంగా మారేంత వరకు గుర్తించలేమన్నారు. ద్రవాహారంతో దీనిని నియంత్రించవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలతో పాటు, వైజాగ్‌లోను వేడిగాలుల తీవ్రత పెరగనుందని, దాని నుంచి తప్పించుకోవడానికి డీహైడ్రేషన్ పట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన



వాల్తేర్ డిపో ఆవరణలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

ఎంవీపీకాలనీ : వాల్తేర్ డిపో యాజమాన్యం తీరును నిరసిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విశాఖ జిల్లా వాల్తేర్ డిపో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వాల్తేర్ డిపో పరిధిలోని కండక్టర్ అక్రమ సెస్పెన్షన్, డిపో యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు నినాదాలు చేశారు. కండక్టర్‌పై సెస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని, వాల్తేర్ డిపో యాజమాన్యం తన ఏకపక్ష నిర్ణయాలను, ఉద్యోగులపై కక్ష సాధింపును మానుకోవాలని అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పీవీ మోహన్, జీఆర్ రావు, ఎంవీఆర్ మూర్తి, బి.నీలకంఠం పాల్గొన్నారు.

ఏయూ రిజిస్ట్రార్‌కు అభినందనల వెల్లువ



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావును అభినందిస్తున్న ఏయూ ఆచార్యులు

విశాఖ సిటీ : ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు అభినందనలు వెల్లువెత్తాయి. ఏయూ ప్రొఫెసర్లు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఏయూ మాజీ వీసీ జి.ఎస్.ఎన్.రాజు, ఐఐపీఈ మాజీ డైరెక్టర్ వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఏయూ ప్రిన్సిపాళ్లు ఎ.నరసింహారావు, జి.గిరిజాశంకర్, కె.సీతామాణిక్యం, గ్రంథాలయ సిబ్బంది, విశ్రాంత బోధనేతర ఉద్యోగుల సంఘం సభ్యులు, విశ్రాంత ఆచార్యులు, వివిధ డీన్‌లు, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. దాంతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అలుమ్నీ అసోసియేషన్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఏయూలో డీన్, విదేశీ విద్యార్థుల వ్యవహారాల విభాగంలోనే కాకుండా రాజమండ్రిలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో ఇన్‌చార్జ్ వీసీగా పనిచేసిన అనుభవం ఏయూ ప్రగతికి దోహదపడుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 2011 నుంచి 2024 వరకు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. ధనుంజయరావు ప్రతిభను గుర్తించి కీలక పదవులు అందించాయన్నారు.

ముస్సిపల్ శాఖ మంత్రికి సమస్యల మొర



మంత్రికి ఉద్యోగుల సమస్యలు వివరిస్తున్న యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆనందరావు

డాబాగార్డెన్స్: విశాఖ విచ్చేసిన మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణను గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం. ఆనందరావు నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలంటూ మొర పెట్టుకున్నారు. వుడా కార్యాలయంలో మంగళవారం మంత్రిని కలిసి పలు సమస్యల పరిష్కారానికి సంబంధించి వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీలో గత 30 ఏళ్లుగా పని చేస్తున్న ఎంటీఎస్, ఎన్ఎంఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయమని కోరారు. మంత్రి స్పందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జీవో 212కు ఎంత మంది అర్హత పొందుతారని అడగ్గా, సుమారు 800 మంది ఉంటారని ఆనందరావు తెలిపారు. అలాగే మున్సిపల్ శాఖలో పని చేస్తున్న ఇంజినీరింగ్, వాటర్ సప్లై ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్‌స్కిల్డ్‌కు రూ.21 వేలు, సెమీ స్కిల్డ్‌కు రూ.24,500 జీవో 36 ప్రకారం చెల్లించాలని, గత 20 ఏళ్లుగా ఎంఏ అండ్ యూడీ డిపార్టుమెంట్‌లో పీహెచ్, నాన్ పీహెచ్ వర్కర్లకు ఒకే రకమైన జీతాలు ఉండేవని మంత్రికి వివరించారు. 9 మంది అధికారుల కమిటీ రిపోర్ట్ ఫైనాన్స్ డిపార్టుమెంట్ వద్ద పెండింగ్‌లో ఉందని తెలపగా మంత్రి స్పందిస్తూ సెప్టెంబర్ చివరి నాటికి కార్మికులు, ఉద్యోగుల డిమాండ్లపై జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి, రెండు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆనందరావు తెలిపారు.

మద్యం సేవించి డ్రైవ్ చేసిన ఇద్దరికి జైలు శిక్ష

జగదాంబ: హార్బర్ స్టేషన్ పరిధి కాన్వెంట్ జంక్షన్ వద్ద మద్యం సేవించి డ్రైవ్ చేసిన వ్యక్తికి జైలుశిక్ష విధించినట్లు స్టేషన్ అధికారి పక్కి గణేష్‌బాబు తెలిపారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు కాన్వెంట్ జంక్షన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వారిని కోర్టుకు హాజరు పరచగా ఇద్దరికి ఏడు రోజుల పాటు జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్టు తెలిపారు.

ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు



అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రతిష్టాత్మకంగా శ్రీలక్ష్మి పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళపద్మారాధన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆచార్య వెంకటకృష్ణకు పలువురి అభినందన



ఆచార్య వెంకటకృష్ణను అభినందిస్తున్న పలు సంఘాల నాయకులు

ఎంవీపీకాలనీ : ఏయూ జాగ్రఫీ విభాగం సీనియర్ ఆచార్యుడు, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ (హెచ్ఆర్‌డీ) సంచాలకుడు ఆచార్య టి.వెంకటకృష్ణ ఏయూ కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్‌గా నియమితులైన నేపథ్యంలో పలు విద్యార్థి, పరిశోధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఆయనను సీడీసీ డీన్‌గా నియమిస్తూ ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య శశిభూషణరావు ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనకు ఆయా సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. ఇప్పటికే వర్సిటీలో అనేక పదవులు అధిరోహించిన ఆచార్య వెంకటకృష్ణ సీడీసీ డీన్‌గా వర్సిటీ అభివృద్ధికి సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకటకృష్ణ మాట్లాడుతూ సీడీసీ డీన్‌గా గురువారం బాధ్యతలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఆయా సంఘాల నాయకులు సిర్ల శ్యామ్, తాళ్లూరి రమేష్, వెంకట్‌నాయుడు, మోహన్, కల్యాణ్, ప్రసాద్, మురళీ, రవి, సూర్యారావు పాల్గొన్నారు.

డాక్టర్ బాబ్జీకి మదర్ థెరిసా పురస్కారం



డాక్టర్ బాబ్జీని సత్కరిస్తున్న సాహిత్య సేవా సంస్థ ప్రతినిధులు

మద్దిలపాలెం : మిసెస్ ఎ.వి.ఎన్.డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, సాహిత్య సేవకుడు డాక్టర్ రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీకి మదర్ థెరిసా సేవా పురస్కారంతో విజయవాడలోని ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ సత్కరించింది. విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం జరిగిన మదర్‌థెరిసా జయంతి వేడుకల్లో డాక్టర్ బాబ్జీని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి



మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొణతాల శ్రీనివాస్ తదితరులు

డాబాగార్డెన్స్: మదర్ థెరిసా జయంతి మంగళవారం కొణతాల ఫౌండేషన్, గాయత్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో గల గాయత్రీ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ కొణతాల శ్రీనివాస్ ముందుగా మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేతుల మీదుగా పేదలకు మందులు పంపిణీ చేశారు. అనంతరం కొణతాల మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా 2008 నుంచి వైద్య శిబిరాలు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు, అన్నదాన కార్యక్రమాలు, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ చేస్తున్నామన్నారు. మదర్‌ను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యురాలు హరిత, ఎల్. స్వాతి, ఎస్. మంగ, బి. చంటి, కామేశ్వరరావు, భారతి తదితరులు పాల్గొన్నారు.